క్లుప్తంగా

గిరిజన ఆశ్రమ పాఠశాల తనిఖీ



విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న తహసీల్దార్ కిరణ్‌కుమార్

పాతపట్నం: మండలంలోని బైదలాపురం గిరిజన ఆశ్రమ పాఠశాలను తహసీల్దార్ ఎస్.కిరణ్ కుమార్ సోమవారం తనిఖీ చేశారు. పాఠశాల పరిసరాల పరిశుభ్రత, వంట గది, స్టోర్ రూమ్, రికార్డులు పరిశీలించారు. మెనూ సక్రమంగా అందుతుందా, లేదా అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులతో కలిసి మధ్యాహ్నం భోజనం చేశారు. పరీక్షల సమయంలో విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. హెచ్ఎం గవిరేసు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పంప్ హౌస్ తొలగింపు



పంప్ హౌస్‌ను జేసీబీతో తొలగిస్తున్న దృశ్యం

కొత్తూరు: మండలంలోని ఆకులతంపరలో తన జిరాయితీలో ఉన్న పంప్ హౌస్‌ను తహసీల్దార్ రవిచంద్ర సోమవారం జేసీబీతో తొలగించారని వైఎస్సార్‌సీపీ నాయకుడు, న్యాయవాది చల్ల రవికిరణ్ తెలిపారు. ఈ స్థలంపై కోర్టులో కేసు ఉందన్నారు. అధికారులు కోర్టు ఉత్తర్వులను పట్టించుకోకుండా తొలగించారన్నారు. టీడీపీ నాయకుల మాట ప్రకారం ఇక్కడ అధికారులు నడుస్తున్నారని ఆరోపించారు. తన భూమిలో ఉన్న పంప్ హౌస్‌ను తొలగించడం చట్ట విరుద్ధమన్నారు. ఈ విషయమై డీటీ నారాయణరావు వద్ద ప్రస్తావించగా.. పంప్ హౌస్ ప్రభుత్వ భూమిలో ఉందన్నారు. టెక్కలి ఆర్డీఓ ఆదేశాల మేరకే తొలగించినట్లు తెలిపారు.

వన్యప్రాణుల సంరక్షణతోనే మానవ మనుగడ



అవగాహన కల్పిస్తున్న ఫారెస్ట్ సెక్షన్ అధికారి యశస్వి

పాతపట్నం: అంతరించిపోతున్న వన్యప్రాణులను సంరక్షించాలనే ఉద్దేశంతోనే వన్యప్రాణి దినోత్సవాన్ని నిర్వహిస్తున్నామని పాతపట్నం అటవీ సెక్షన్ అధికారి పి.యశస్వి అన్నారు. సోమవారం ప్రపంచ వన్యప్రాణి దినోత్సవం సందర్భంగా పాతపట్నం అంతరాబ ఫారెస్ట్‌కు విద్యార్థులను తీసుకువెళ్లారు. సమతుల్యత, వన్యప్రాణుల సంరక్షణకు తీసుకోవాల్సిన చర్యల గురించి వివరించారు. అడవులను కాపాడాలన్నారు. బీట్ అధికారులు ఉమామహేశ్వరరావు, ప్రవీణ్‌రాజ్, ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలకు చెందిన విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

శబ్ద తీవ్రతతో వినికిడికి దెబ్బ



అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యులు, సిబ్బంది

సారవకోట: ఎక్కువ శబ్ద తీవ్రత వలన అనేక నష్టాలు కలుగుతాయని బొంతు పీహెచ్‌సీ వైద్యురాలు డి.సుధారాణి సూచించారు. సోమవారం మండలంలోని బొంతు పీహెచ్‌సీ పరిధిలో వినికిడి దినోత్సవం పురస్కరించుకుని అవగాహన ర్యాలీ నిర్వహించారు. డీజేలు అధికంగా వాడుతున్నారని, దీనివలన వినికిడి శక్తికోల్పోయే ప్రమాదం ఉందన్నారు. యువత హియర్ ఫోన్లు, హియర్ బడ్స్ వాడటం వలన కూడా వినికిడి శక్తి కోల్పోయే అవకాశం ఉందన్నారు. ఆస్పత్రి సిబ్బంది, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

పాలిథిన్ వస్తువులు విక్రయిస్తే కఠిన చర్యలు



సింగిల్ యూజ్ ప్లాస్టిక్ సరుకులను పట్టుకున్న మున్సిపల్ అధికారి

ఆమదాలవలస: పట్టణంలో సింగిల్ యూజ్ పాలిథిన్ వస్తువులు ఎవరైనా విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని మున్సిపల్ కమిషనర్ పూజారి బాలాజీప్రసాద్ హెచ్చరించారు. సోమవారం మున్సిపాలిటీ పరిధి మెట్టక్కివలసలో ఎన్విరాన్మెంట్ సెక్రటరీ కె.కుమారస్వామి తనిఖీలు చేపట్టారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వస్తువులు విక్రయిస్తున్న రెండు దుకాణాల నుంచి సుమారు రూ.80 వేల విలువ చేసే సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వస్తువులను స్వాధీన పర్చుకున్నారు. ఒకరికి రూ.5 వేలు, మరొకరికి రూ.8 వేల అపరాధ రుసుం విధించినట్లు తెలిపారు.

భవనం ఒకటే.. శాఖలు ఐదు!



ఎల్.ఎన్.పేట మండల పరిషత్ కార్యాలయం

- పరాయిపంచనే విద్య, వ్యవసాయం, ఉపాధి
- ఆదేదారిలో మరికొన్ని శాఖలు
- మండల ఏర్పడి ఏళ్లు కావస్తున్నా కొత్త భవనాల్లేవ్
- పక్క మండలం నుంచి పోలీస్ సేవలు



వ్యవశాయ శాఖకు సంబంధించి ఇలా..



ఒకే గదిలో విద్య, వ్యవసాయ శాఖలు

ఎల్.ఎన్.పేట: ప్రజల వద్దకు పరిపాలన తీసుకువచ్చేందుకే మండల వ్యవస్థ ఉంది. మండల కేంద్రాల్లో అన్ని ప్రభుత్వ శాఖలకు పూర్తిస్థాయిలో భవనాలు ఉండాలి. ప్రభుత్వ కార్యాలయాలకు అనేక పనులపై వచ్చే ప్రజలకు సమాధానం చెప్పాలి. ప్రభుత్వం నుంచి వచ్చిన పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లేందుకు, పరిపాలన నడిపేందుకు కార్యాలయాల అవసరం ఎంతైనా ఉంది. ప్రతి ఒక్కరూ ఇలాగే పరిపాలన జరుగుతుందని అనుకుంటారు. కానీ ఎల్.ఎన్.పేట మండల కేంద్రంలో ఇందుకు విరుద్ధంగా ఉంది.

ఎల్.ఎన్.పేటలో సీన్ రివర్స్

జిల్లాలో 1999 ఫిబ్రవరి 26వ తేదీన ఎల్.ఎన్.పేట మండల కేంద్రంగా ఆవిర్భవించింది. ఆ తరువాత అధికారంలోకి వచ్చిన ప్రభుత్వాలు మండల పరిషత్ కార్యాలయం, ఐకేపీ (మహిళా సమైఖ్య) భవనం, తహసీల్దార్ కార్యాలయం, గృహనిర్మాణ శాఖ భవనాలను నిర్మించారు. ఇతర శాఖలకు చెందిన భవనాల నిర్మాణం జరగలేదు. మండల పరిషత్ కార్యాలయంలో చాలీచాలని ఇరుకు గదుల్లో సుమారు 26 ఏళ్లుగా పరిపాలన సాగిస్తున్నారు. వ్యవసాయ, విద్య, ఉపాధి, ఐసీడీఎస్, పంచాయతీ కార్యదర్శులు, మండల పరిషత్ పరిపాలన, పీఆర్ (ఇంజినీరింగ్), మండల పరిషత్ సమావేశ మందిరంతోపాటు ఎంపీపీ, జెడ్పీటీసీల చాంబర్లు కూడా మండల పరిషత్ కార్యాలయంలోనే ఉన్నాయి.

ఎన్నో ఇబ్బందులు

అన్నిశాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు ఒకే దగ్గర ఉండటం వలన ఇక్కడ పనిచేసే వివిధ శాఖలకు చెందిన అధికారులు, కార్యాలయానికి వచ్చే సందర్శకులు ఇబ్బందులు పడుతున్నారు. చాలీచాలని గదులు, కూర్చునేందుకు కుర్చీల్లేకపోవడం, కొన్ని సందర్భాల్లో సందర్శకుల అరుపులు, కేకలతో అనేక అవస్థలు పడుతున్నామని పలు శాఖల అధికారులు వాపోతున్నారు. ముఖ్యంగా విద్యాశాఖ కోసం ఎమ్మార్సీ, వ్యవసాయశాఖ కోసం కూడా ఒక ప్రత్యేక భవనాన్ని నిర్మించాల్సి ఉంది. పరిపాలనకు సంబంధించి జిల్లా అధికారులు ఎవరైనా వస్తే మండల పరిషత్ కార్యాలయంలోనే ఉండాల్సి వస్తుంది.

పోలీస్ స్టేషనే లేదు..

మండలం ఏర్పడి సుమారు 26 ఏళ్లు అవుతున్నప్పటికీ పోలీస్ స్టేషన్ ఏర్పాటు చేయలేదు. సరుబుజ్జిలి పోలీస్ స్టేషన్ నుంచే ఎల్.ఎన్.పేట మండలానికి సంబంధించిన శాంతిభద్రతల పరిపాలన కొనసాగిస్తున్నారు. ఈ స్టేషన్ పరిధిలోని రెండు మండలాలను పరిశీలిస్తే ఎల్.ఎన్.పేటలోనే క్రైమ్ (నేరాల) రేటు ఎక్కువగా ఉంటుంది. ఏదైనా సంఘటన జరిగినప్పుడు సరుబుజ్జిలి నుంచి పోలీసులు వచ్చేందుకు దూరం కావటంతో ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా పాలకులు, జిల్లా అధికారులు స్పందించి పోలీస్ స్టేషన్ ఏర్పాటుతో అన్ని శాఖలకు ప్రత్యేక భవనాలను నిర్మించాలని మండల ప్రజలు, ఆయా శాఖల అధికారులు కోరుతున్నారు.

కొత్త భవనాల కోసం కోరాం



పరిపాలన పరంగా ఆయా శాఖలకు కొత్త భవనాల నిర్మాణం కోసం అధికారుల ద్వారా ప్రభుత్వాన్ని కోరాం. మండల పరిషత్ కార్యాలయంలో ఎక్కువ శాఖల అధికారులు ఉంటూ శాఖల వారీగా పరిపాలన కొనసాగిస్తున్నారు. గదుల కొరత కూడా ఉంది. కొత్త భవనాలు నిర్మాణంతోపాటు ఆయా శాఖల వారీగా ఉన్న సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటాం.

–పి.శ్రీనివాసరావు, ఎంపీడీఓ, ఎల్.ఎన్.పేట

ప్రభుత్వ వైఫల్యాలు ప్రజల్లోకి తీసుకువెళ్లాలి



విష్ణుమూర్తిని సత్కరిస్తున్న మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి, నాయకులు

- పాతపట్నం మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి

ఎల్.ఎన్.పేట: కూటమి ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాల్సిన బాధ్యత వైఎస్సార్‌సీపీ శ్రేణులపై ఉందని పాతపట్నం మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి అన్నారు. పాతపట్నంలోని తన క్యాంపు కార్యాలయం వద్ద సోమవారం ఎల్.ఎన్.పేట మండల నాయకులతో సమావేశమయ్యారు. చంద్రబాబు, పవన్ కళ్యాణ్‌తోపాటు పలువురు కూటమి నాయకులు ఎన్నికల ముందు సూపర్ సిక్స్ హామీలు ఇచ్చి, అమలు చేయకుండా దాటవేస్తున్నారన్నారు. రైతులకు పెట్టుబడి సాయంగా ఇస్తామన్న అన్నదాత సుఖీభవ, మహిళలకు నెలకు రూ.1,500, నిరుద్యోగులకు నెలకు రూ.3 వేలు, తల్లికి వందనం, మహిళలకు ఉచిత బస్ ప్రయాణం వంటి పథకాలు ఒక ఏడాది ఎగ్గొట్టారని, వీటిని ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు.

ఈ 9 నెలల పాలనలో గ్రామాల్లో అభివృద్ధి పనుల పేరుతో నిధుల దోపిడీ జరిగిందన్నారు. వైఎస్సార్‌సీపీ నాయకులు నిరంతరం ప్రజల మధ్య ఉండాలని సూచించారు. ఈ సందర్భంగా ఎల్.ఎన్.పేట మండలం వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడిగా అధిష్టానం ప్రకటించిన పెనుమజ్జి విష్ణుమూర్తిని సత్కరించి, అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల పరిషత్ ప్రత్యేక ఆహ్వానితులు రెడ్డి రామారావు, మాజీ ఎంపీపీ, పార్టీ జిల్లా అధికార ప్రతినిధి శిమ్మ సాంబశివరావు, మాజీ పీఏసీఎస్ అధ్యక్షుడు కొల్ల కృష్ణ, పార్టీ నాయకులు ఈగల చిన్నారావు, కొల్ల రాము, బలగ గోవిందరావు, ఆనందరావు, తదితరులు పాల్గొన్నారు.

కార్మిక విభాగం అధ్యక్షుడిగా బాలకృష్ణ



రెడ్డి శాంతికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న బాలకృష్ణ

హిరమండలం: వైఎస్సార్‌సీపీ మండల కార్మిక విభాగం అధ్యక్షుడిగా చక్క బాలకృష్ణ నియమితులయ్యారు. ఈ మేరకు సోమవారం మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి నియామక ఉత్తర్వులు అందించారు. గత కొంతకాలంగా బాలకృష్ణ పార్టీలో క్రియాశీలకంగా వ్యవహరిస్తున్నారు. అందుకే కార్మిక విభాగ బాధ్యతలు అప్పగించినట్లు రెడ్డి శాంతి తెలిపారు. పనిచేసే కార్యకర్తలకు వైఎస్సార్‌సీపీలో గుర్తింపు ఉంటుందన్నారు. ఈ సందర్భంగా రెడ్డి శాంతికి బాలకృష్ణ కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ మండల కన్వీనర్ మీసాల వెంకట రామకృష్ణ, తదితరులు ఉన్నారు.

బాలికల చదువుతోనే సమాజ వికాసం



కొవ్వొత్తులతో మానవహారం నిర్వహిస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు

పాతపట్నం: బాలికలకు ఉన్నత చదవులు చదివించాలని, బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని పాతపట్నం ఐసీడీఎస్ పీఓ టి.విమలారాణి అన్నారు. పాతపట్నంలోని దువ్వారి వీధి ప్రధాన రహదారిలో పాతపట్నం ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని అంగన్‌వాడీ కార్యకర్తలతో సోమవారం రాత్రి కొవ్వొత్తులతో అవగాహన ర్యాలీ, మానవహారం నిర్వహించారు. అంతర్జాతీయ మహిళా వారోత్సవాల్లో భాగంగా పాతపట్నం, మెళియాపుట్టి మండలాల్లోని అంగన్‌వాడీ కేంద్రల్లో మొక్కలు నాటినట్లు పీఓ తెలిపారు.

టీడీపీ నాయకుల మాటలు నమ్మొద్దు

ఆమదాలవలస: సరుబుజ్జిలి మండలం వెన్నెలవలసలో నిర్మించనున్న థర్మల్ పవర్ ప్లాంట్‌పై అపోహలు వద్దని చెబుతున్న తెలుగుదేశం పార్టీ నాయకుల మాటల వెనుక పెద్ద మోసం ఉందని, వారి మాటలు నమ్మొద్దని ఆమదాలవలస మున్సిపాలిటీ రెండో వార్డు వైఎస్సార్‌సీపీ నాయకుడు అన్నెపు కృష్ణారావు అన్నారు. సోమవారం ఆమదాలవలసలో విలేకర్లతో మాట్లాడారు. ఆమదాలవలస ఎమ్మెల్యే కూన రవికుమార్ ఈ కుతంత్రాన్ని మానుకోవాలని హితవు పలికారు.

పవర్ ప్లాంట్ నిర్మాణ ప్రతిపాదనలపై అనేక ఆందోళనలు ఉన్నాయని, ఈ ప్లాంట్ కారణంగా మానవ జీవనంపై ప్రభావితం చేసే ప్రమాదం ఉందన్నారు. పర్యావరణం దెబ్బతింటుందన్నారు. పార్టీ నాయకులు పైడి మురళి, తమ్మినేని రాజారావు ఉన్నారు.

చెత్త తొలగింపు

సాక్షి ఎఫెక్ట్

హిరమండలం: మండల కేంద్రంలోని చిన్నకొరాడ ప్రాథమిక పాఠశాల ఆవరణలో 'చెత్త తొలగించండి' అనే వార్త సాక్షిలో సోమవారం ప్రచురితమైంది. దీనిపై పంచాయతీ పాలకవర్గం స్పందించింది. ఆ ప్రాంతాన్ని శుభ్రం చేసింది. విద్యార్థుల తల్లిదండ్రులతోపాటు ఉపాధ్యాయులు సంతోషం వ్యక్తం చేశారు.



పాఠశాల ఆవరణలో చెత్తను తొలగించిన తర్వాత ఇలా..

వేతనదారులందరికీ ఉపాధి



మాట్లాడుతున్న డ్వామా పీడీ సుధాకరరావు

నరసన్నపేట: జాబు కార్డుఉన్న వారు పని కావాలని వస్తే కల్పించాల్సిన బాధ్యత ఫీల్డ్ అసిస్టెంట్లదేనని డ్వామా పీడీ సుధాకరరావు అన్నారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయ సమావేశ మందిరంలో క్లస్టర్ స్థాయిలో ఆరు మండలాల ఉపాధి సిబ్బందితో సోమవారం సమీక్ష నిర్వహించారు. వేతనదారులందరికీ వంద రోజుల పని కల్పించాలన్నారు. భూగర్భ జలాలు పెంపొందించడానికి రైతులకు ఫారం పాండ్స్, ఇంకుడు గుంతల నిర్మాణాలపై అవగాహన కల్పించాలన్నారు. ఉపాధి పథకం సిబ్బందికి నిర్దేశించిన లక్ష్యాలు చేరుకోవాలని, నిర్లక్ష్యంగా ఉంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రతీ పంచాయతీలో పనులు చేపట్టాలని విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా ఉండొద్దన్నారు. నరసన్నపేట క్లస్టర్ ఏపీడీ లోకేశ్వరరావు, ఏపీఓలు, టెక్నికల్, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

పాఠశాలకు మార్గం చూపాలని వినతి

సారవకోట: మండలంలోని మహాశింగి పంచాయతీ కన్నయ్యగూడ నుంచి విద్యార్థులు తోవ లేక నారాయణపురం పాఠశాలకు హాజరుకావడం లేదు. గత ఐదు రోజుల నుంచి విద్యార్థులు పాఠశాలకు రావడం లేదని సంబంధిత ఉపాధ్యాయుడు నర్సింహమూర్తి సోమవారం స్థానిక ఎంఈఓ ఎం.వి.రమణకు ఫిర్యాదు చేశారు. ఇక్కడ నుంచి ఐదురుగు విద్యార్థులు పాఠశాలకు వచ్చేవారని, పాఠశాలకు వచ్చేందుకు మార్గం లేకపోవడంతో రాలేకపోతున్నారని పేర్కొన్నారు. దీనిపై ఎంఈఓ తహసీల్దార్, ఎంపీడీఓలకు తగిన చర్యలు తీసుకోవాలని కోరుతూ వినతిపత్రం అందించారు.

6న నేత్ర వైద్య శిబిరం

నరసన్నపేట: ఈ నెల 6వ తేదీన స్థానిక చిత్తిరి వీధిలోని సత్యసాయి మందిరంలో ఉచిత నేత్ర చికిత్స శిబిరం నిర్వహించనున్నారు. ఈ మేరకు శంకర్ ఫౌండేషన్ పీఆర్ఓ అప్పలరాజు, సత్యసాయి కన్వీనర్ నాగేశ్వరరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి తనిఖీలు నిర్వహిస్తామన్నారు. కంట్లో శుక్లాలు ఉన్న వారికి ఉచితంగా ఆపరేషన్ చేస్తామన్నారు. ఆధార్, రేషన్ కార్డులు తీసుకురావాలని కోరారు. జిల్లా అంధత్వ నివారణ సంస్థ సౌజన్యంతో ఈ శిబిరం జరుగుతుందన్నారు.

పరామర్శ..



శాంతారామ్ కుటుంబాన్ని పరామర్శిస్తున్న చింతాడ రవికుమార్, నాయకులు

పొందూరు: పొందూరుకు చెందిన విశ్రాంత ఉపాధ్యాయుడు కాళ్లకూరి శాంతారామ్, అనకాపల్లి బాబు, లోలుగు మాజీ సర్పంచ్ లోలుగు తవిటమ్మ ఇటీవల మృతి చెందారు. ఆయా కుటుంబాలను ఆమదాలవలస నియోజకవర్గం వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త చింతాడ రవికుమార్ సోమవారం పరామర్శించారు. పరామర్శించిన వారిలో జెడ్పీటీసీ సభ్యుడు లోలుగు కాంతారావు, పొందూరు పట్టణ పార్టీ అధ్యక్షుడు గాడు నాగరాజు, ఎంపీటీసీ సభ్యుడు లోలుగు లక్ష్మన్నాయుడు, పార్టీ జిల్లా మహిళా నాయకురాలు కూన రమణమ్మ, అనకాపల్లి రామకృష్ణ, అక్కలనాయుడు, తదితరులు ఉన్నారు.

'గాదె' విజయంపై ఆనందం



నరసన్నపేట: విక్టరీ సింబల్ చూపుతున్న ఉపాధ్యాయులు



హిరమండలం: విజయ సంకేతం చూపిస్తున్న ఉపాధ్యాయులు



కొత్తూరు: విజయోత్సవాన్ని నిర్వహిస్తున్న పీఆర్టీయూ నేతలు

ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో గాదె శ్రీనివాసులు నాయుడు విజయం సాధించడం పట్ల పీఆర్‌టీయూ నాయకులు ఆనందం వ్యక్తం చేశారు. సోమవారం ఓట్ల లెక్కంపు చేపట్టారు. గాదె విజయానికి ఏపీటీఎఫ్(1938), పీడీ అసోసియేషన్, భాషా పండితులు, ఎస్‌టీయూ, ఆపస్ బలపరిచాయని ఏపీటీఎఫ్ నాయకులన్నారు. మొదటి ప్రాధాన్యత ఓటులో మెజార్టీ సాధించడంతో ఆనందం వ్యక్తం చేశారు.

– సాక్షి నెట్‌వర్క్

మరీ ఇంత నిర్లక్ష్యమా!



ఈ చిత్రం సరుబుజ్జిలి మండలంలోని పాలవలస రహదారిపై ఉన్న ఇసుక. పురుషోత్తపురం అధికారిక ఇసుక ర్యాంపు నుంచి నిత్యం వాహనాలు ప్రయాణాలు చేస్తుంటాయి. రొట్టవలస నుంచి పురుషోత్తపురం వరకు గల ఆర్అండ్‌బీ రహదారిలో పాలవలస, ఓపెన్ హెడ్ చానల్ సమీపంలో వాహనాల నుంచి ఇసుక జారిపడి రోడ్డుపై నిల్వ అయింది. అతివేగంగా వచ్చిన వాహనదారులు ఆయా ప్రాంతాల్లో ప్రమాదాల బారిన పడుతున్నారు.

- సరుబుజ్జిలి

నిరుపయోగం



ఈ చిత్రం సరుబుజ్జిలి మండల కేంద్రంలోని బస్టాండ్ ఆవరణలో నిరుపయోగంగా ఉన్న మరుగుదొడ్లు. బస్టాండ్ నిర్వహణ సక్రమంగా లేకపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రయాణికుల కోసం నిర్మించిన మరుగదొడ్లకు రన్నింగ్ వాటర్ సదుపాయం లేక మూతపడ్డాయి. గతంలో ఉన్న కంట్రోలర్ పోస్టును పూర్తిగా రద్దు చేయడం వలన బస్‌స్టేషన్ నిర్వహణను పట్టించుకునేవారే కరువయ్యారు. బస్సులు రాకపోకల గురించి తెలియక ఇబ్బంది పడుతున్నారు. విద్యుత్ సౌకర్యం లేకపోవడం వలన రాత్రి వేళల్లో మహిళా ప్రయాణికులు చీకట్లోనే బస్సుల కోసం వేచి ఉంటున్నారు. ఆర్టీసీ అధికారులు ఈ సమస్యలను పరిష్కరించాలని ప్రయాణికులు కోరుతున్నారు.

- సరుబుజ్జిలి

మేట్ నియామకంపై ఫిర్యాదు



కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తున్న శ్రీరామ ఉపాధి సంఘం వేతనదారులు

కొత్తూరు: తమ గ్రూప్ నుంచి కాకుండా మరో గ్రూప్ సభ్యురాలని మేట్‌గా ఉపాధి హామీ పథకం మండలాధికారులు నియమించారని జిల్లా కేంద్రంలో సోమవారం నిర్వహించిన గ్రీవెన్స్‌లో కలెక్టర్‌కు గులివిందలపేటకు చెందిన శ్రీరామ ఉపాధి పథకం గ్రూప్ సభ్యులు ఫిర్యాదు చేశారు. పేడాడ సుజాతను తమ గ్రూప్ మేట్‌గా సభ్యులందరం ఏకగ్రీవంగా ఎన్నుకున్నామని, ప్రస్తుతం ఆమె మేట్‌గా పని చేస్తున్నారన్నారు. మా గ్రూప్ సభ్యుల ప్రమేయం లేకుండా ఉపాధి అధికారులు మరో గ్రూప్ నుంచి పుష్పలతను మేట్‌గా నియమించడం సరికాదన్నారు. అధికారులు తమ గ్రామంలో గొడవలు పెట్టడానికే ఇటువంటి నిర్ణయం తీసుకున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. మేట్‌గా నియమించిన పుష్పలతను తొలగించాలని కోరారు. ఇదిఇలా ఉండగా శ్రీరామ ఉపాధి సంఘానికి మేట్‌గా తాను పనిచేయనని కెలెక్టర్‌కు నూతనంగా నియమించిన పుష్పలత ఫిర్యాదు చేశారు. నాకు తెలియకుండా ఆ సంఘానికి మేట్‌గా నియమించారని ఫిర్యాదులో తెలిపారు. మేట్‌గా నా పేరును తొలగించాలని కోరారు. గ్రామంలో అల్లర్లు సృష్టించడానికే అధికారులు ఇటువంటి చర్యలకు పాల్పడుతున్నట్లు పుష్పలత చెప్పారు.

సంక్షిప్తంగా..

నేటి నుంచి జాతర...

ఆమదాలవలస: పురపాలక సంఘం పరిధి 22వ వార్డు లక్ష్ముడుపేటలో గల భక్తాంజనేయ స్వామి 65వ వార్షికోత్సవం సందర్భంగా మంగళవారం నుంచి గురువారం వరకు జాతర జరుగుతుందని నిర్వాహక కమిటీ సభ్యులు సోమవారం తెలిపారు. ఈ మూడు రోజులు స్వామివారికి ప్రత్యేక పూజ, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు.

9 నుంచి కూర్మంలో ఆధ్యాత్మిక కార్యక్రమాలు

హిరమండలం: ఆధ్యాత్మిక ధామం కూర్మ మరో వేడుకకు ముస్తాబవుతోంది. ఏటా శ్రవణ మాసంలో వారం రోజులపాటు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. ఈ నెల 9 నుంచి 16వ తేదీ వరకు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఆధ్యాత్మిక గురువు నరోత్తమ ప్రభుదాస్ సోమవారం తెలిపారు. కార్యక్రమాల నిర్వహణకు సంబంధించి షెడ్యూల్ ప్రకటించారు. 9న అంతర్జాతీయ కృష్ణచైతన్య ప్రచారకుడు త్రిదండి సన్యాసి పరమ పూజ్య భక్తి వికాసస్వామి ఆధ్వర్యంలో శ్రవణ కీర్తనలు ఉంటాయన్నారు. బ్రిటన్ నుంచి ఆయన వస్తున్నట్టు తెలిపారు. 14న గౌరీపౌర్ణమి మహోత్సవం, 15న జగన్నాథమిశ్ర ఉత్సవం, 16న మహా హారతి, ప్రసాదం పంపిణీ ఉంటుందన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

బూర్జ: మండలంలోని కొల్లివలసలో ఉన్న డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ గురుకులంలో 2025–26 విద్యా సంవత్సరంలో ఐదో తరగతి, ఇంటర్మీడియెట్ (ఇంగ్లిష్ మీడియం)లో ఖాళీగా ఉన్న సీట్లకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ దువ్వాడ దేవేంద్రరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్ ప్రథమ సంవత్సరంలో 80 సీట్లు ఖాళీలు ఉన్నాయన్నారు. వీటికోసం మార్చి 6వ తేదీ లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలన్నారు.

గీతా విశిష్టతను తెలుసుకోవాలి

జలుమూరు:గీతా విశిష్టత ప్రతి ఒక్కరూ తెలుసుకొని సన్మార్గంలో నడవాలని త్రైత సిద్ధాంతం – ప్రబోధ సేవా సమితి కమిటీ అధ్యక్షుడు శ్రీనివాస్ అన్నారు. సోమవారం గొటివాడ, అల్లాడ, అల్లాడపేట గ్రామాల్లో ప్రచారం నిర్వహించి వాటి ప్రతులను పంచిపెట్టారు. భగవానుని గీతోపదేశం పొంది సంపూర్ణ గుణవంతువడవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో సభ్యులు పాల్గొన్నారు.